నేరాల నియంత్రణలో జాగిలాల పాత్ర కీలకం

- మొయినాబాద్ ఐఐటీఏకు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు
- 390 కి.మీ. ఎత్తుకు ఎగురగల గరుడ డ్రోన్‌లు
- 24వ బ్యాచ్‌లో 72 జాగిలాల పాసింగ్ అవుట్ కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జనరల్ శివధర్‌రెడ్డి

మొయినాబాద్, ఫిబ్రవరి 28 : నేరాల నియంత్రణలో, పోలీసుల దర్యాప్తులో జాగిలాల పాత్ర చాలా కీలకమని ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జనరల్ శివధర్‌రెడ్డి అన్నారు. మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటేడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీలో ఏడాది పాటు శిక్షణ పొందిన 72 జాగిలాలను 24వ బ్యాచ్‌గా శుక్రవారం పాసింగ్ అవుట్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన జాగిలాలు చేసిన విన్యాసాలు, ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలీసులు ఛేదించలేని నేరాలను జాగిలాల ద్వారా పసిగట్టవచ్చని పేర్కొన్నారు. మొయినాబాద్‌లోని ఐఐటీఏలో తెలంగాణ రాష్ట్రంలోని జాగిలాలతో పాటు దేశంలోని గోవా, అస్సాం, త్రిపుర, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల జాగిలాలతో పాటు హ్యాండులర్స్‌కు శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. దేశంలో ఉన్న శిక్షణా కేంద్రాల్లో మొయినాబాద్‌లో ఉన్న ఐఐటీఏకు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉందని పేర్కొన్నారు. అన్ని రాష్ట్రాలకు చెందిన జాగిలాలకు మొయినాబాద్‌లో గల ఐఐటీఏలో శిక్షణ ఇప్పించాలని కోరుకుంటారని తెలిపారు.

శిక్షణా కేంద్రంలో మంచి నైపుణ్యమున్న శిక్షకులున్నారని, వారి ద్వారా శిక్షణ పొందిన జాగిలాలు అద్భుతమైన విజయాలు సాధించాయని తెలిపారు. భద్రతా విభాగంలో మరో అడుగు ముందుకేసి గరుడ దళానికి కూడా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. శిక్షణ పొందిన గరుడ

జాగిలం కళ్లకు గంతలు కట్టి రోప్‌వేపై నడిపిస్తున్న హ్యాండ్యులర్

పక్షులు సుమారు 390 కిలోమీటర్‌ల ఎత్తులో గగనతలంలో ఎగురగలవన్నారు. శత్రు దేశాలు మన దేశంపై దాడి చేయడానికి గగనతలంలోకి డ్రోన్‌లను వదిలినప్పుడు.. గరుడ డ్రోన్‌లను గగనతలంలోకి వదిలితే, వాటిని వెంటనే పసిగట్టి భూతలం మీదకి సమాచారాన్ని అందించగలవని పేర్కొన్నారు. ఎక్కువ శాతం సరిహద్దుల్లో గరుడ దళాన్ని ఉపయోగించడం జరుగుతుందని తెలిపారు. శత్రు దేశాల

జాగిలాల పాసింగ్ అవుట్ కార్యక్రమంలో పాల్గొన్న ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జనరల్ శివధర్‌రెడ్డి

ఎత్తుగడలను చిత్తు చేయడానికి గరుడ దళాలను భద్రతా విభాగంలో వినియోగించడం జరుగుతుందని పేర్కొన్నారు. మావోలు, టెర్రరిస్టుల కదలికలను సులువుగా పసిగట్టగల సామర్థ్యం గరుడ పక్షులకు ఉందని తెలిపారు.

భద్రతా, నేరాల నియంత్రణలో జాగిలాలు, గరుడ దళాలు చాలా సహాయపడుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ డీఐజీ తఫ్సీర్ ఇక్బాల్, రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, ఐపీఎస్‌లు భాస్కరన్, ఎస్‌జెడ్ ఖాన్, సుగుణరాం పాల్గొన్నారు.

అలరించిన జాగిలాల విన్యాసం

మొయినాబాద్‌లోని ఐఐటీఏలో జాగిలాల పాసింగ్ అవుట్ కార్యక్రమంలో జాగిలాల విన్యాసాలు, ప్రదర్శనలు అందరినీ అలరించాయి. శిక్షణ పొందిన జాగిలాలు ముఖ్య అతిథులకు గౌరవప్రదంగా హ్యాండులర్స్ చెప్పినట్లుగా గౌరవ వందనం చేసి అందరినీ అలరించాయి. భూతగా దాల్లో హత్య చేసిన నేరస్తులు ప్రజల మధ్య సంచరిస్తుండగా జాగిలాలు వారిని గుర్తించి పోలీసులకు అప్పగించాయి. బ్రీఫ్‌కేసులో పెట్టిన బాంబులు, బ్యాగ్‌లలో పెట్టిన మత్తు పదార్థాలను జాగిలాలు వాసన గుర్తించి అందరినీ ఆకట్టుకున్నాయి. మంటలు మండుతున్న రింగ్‌ల నుంచి జాగిలాలు సునాయాసంగా దూకుతూ విన్యాసాలు చేశాయి. ముఖ్య అతిథులకు బొకేలను ఇచ్చి గౌరవ వందనం చేశాయి. టన్నెల్స్, స్విమ్మింగ్ పూల్‌ల నుంచి పరుగులు తీసాయి. జాగిలానికి కళ్లకు గంతలు కట్టి రోప్ వేపై నడిపించారు.

గరుడ డ్రోన్‌లతో హ్యాండులర్స్

అన్నం కోసం కిలోమీటర్ల నడక..!

- ఇదీ కొండనాగులోని బాలుర ఎస్సీ హాస్టల్ విద్యార్థుల పరిస్థితి
- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ మండిపాటు

వికారాబాద్, ఫిబ్రవరి 28 : కాంగ్రెస్ ప్రభుత్వంలో హాస్టల్ విద్యార్థులకు అన్నం పెట్టే పరిస్థితి దాపురించిందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ శుక్రవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. నాగర్ కర్నూల్ జిల్లా, బల్మూర్ మండలం, కొండనాగులలోని ఎస్టీ బాలుర వసతి గృహంలో బుధవారం మహాశివరాత్రి సందర్భంగా 380 మంది ఉన్న విద్యార్థులలో 108 మంది తమ స్వగ్రామాలకు వెళ్లిపోయారు. మిగిలిన 200 మంది వసతిగృహంలోనే ఉండగా సిబ్బంది ఉదయం అల్పాహారం, నీళ్లచారు వడ్డించారు. మధ్యాహ్నం విద్యార్థులకు ఎలాంటి వంట చేయకపోగా ఆకలిగా ఉందని అడిగిన విద్యార్థులకు అక్కడి నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుడిబండ క్షేత్రం (శివాలయం)లో అన్నదానం చేస్తున్నారని, అక్కడికి వెళ్లి తినాలని ఆదేశించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి వీరంరాజుపల్లి రోడ్డులోని గంగమ్మ ఆలయం వద్ద వెళ్లి తినాలని విద్యార్థులను ఆదేశించారన్నారు. ఆకలితో అలమటిస్తున్న విద్యార్థులు వేరే మార్గం లేక పరుగులు తీయడం బాధాకరమన్నారు. దాంతో ఆ విద్యార్థులు మరుసటి రోజు ఉదయం వరకు పస్తులు ఉండాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. వసతిగృహ సంక్షేమ అధికారిని విషయంపై ఆరా తీయగా పత్రికా మిత్రులకు ఆయన నిర్లక్ష్యంగా.. నేను ఆ రోజు వెళ్లలేదంటూ సమాధానం చెప్పి దాటవేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పాలన కుంటుపడగా, కనీసం చిన్న పిల్లలకు సైతం అన్నం పెట్టలేని దుస్థితి దాపురించిందని మెతుకు ఆనంద్ మండిపడ్డారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులకు ఆదేశం

వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత అధికారులతో పాల్గొన్న డీఆర్వో సంగీత

ఆదిబట్ల, ఫిబ్రవరి 28 : మార్చి 5 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ వార్షిక పరీక్షలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఏర్పాట్లు పకడ్బందిగా చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శుక్రవారం ఇంటర్మీడియట్ పరీక్షలపై జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి డీఆర్వో సంగీత మాట్లాడుతూ.. పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 185 పరీక్షా కేంద్రాలు ద్వారా 77,863 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, 31 ప్రశ్నాపత్రాల స్టోరేజ్ పాయింట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్, పరీక్షా సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు చేపడుతామని తెలిపారు. విద్యార్థులు సకాలంలో హాజరయ్యేలా ఆర్టీసీ అధికారులు బస్సులను నడిపేలా, పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో మెడికల్ పాయింట్ ఏర్పాటు చేసి సిబ్బంది కేంద్రాల వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు వెంక్యానాయక్, సుశీందర్‌రావు, పోలీస్, పోస్టల్, విద్యుత్, మెడికల్ అధికారులు పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకారం ఇంటర్ పరీక్షలు

జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్

సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

వికారాబాద్, ఫిబ్రవరి 28 : తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఇంటర్ పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి సంవత్సరం విద్యార్థులకు మార్చి 5 నుంచి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మార్చి 6 నుంచి థియరీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 6418 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1496 మంది., ద్వితీయ జనరల్ విద్యార్థులు 5589, ఒకేషనల్ విద్యార్థులు 1374 మంది ఉన్నారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 29 థియరీ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, వీటిలో 9 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పదకొండు పరీక్షా కేంద్రాలు, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ కళాశాలల్లో నాలుగు, మైనార్టీ వెల్ఫేర్ జూనియర్ కళాశాలల్లో ఒకటి, తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల్లో ఒకటి, ప్రైవేట్ అండ్ ఎయిడెడ్ కళాశాలల్లో పన్నెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్షలను నియమ, నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీటి సౌకర్యంతో పాటు మౌలిక వసతులు కల్పించాలన్నారు. విద్యార్థులకు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్ష నిర్వహణలో అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రూపాలక్ష్మి, సత్తయ్య, డిస్ట్రిక్ట్ బల్క్ ఇన్‌చార్జి బుచ్చిరెడ్డి, ప్రిన్సిపాళ్లు నర్సింహారెడ్డి, కుమారస్వామి, సురేశ్వరస్వామి, వెంకటేశ్వరరావు, వివిధ కళాశాలల చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ మెంబర్స్, సిట్టింగ్ స్క్వాడ్ మెంబర్స్, కస్టోడియన్స్ పాల్గొన్నారు.

బొంపల్లి పాఠశాలలో ఏఐ తరగతులను పరిశీలిస్తున్న డీఈవో రేణుకాదేవి

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బోధన పరిశీలన

దోమ, ఫిబ్రవరి 28 : విద్యార్థులు క్రమం తప్పకుండా ఏఐ తరగతులు వినేలా ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని వికారాబాద్ జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) బోధనను శుక్రవారం జిల్లా విద్యాధికారి రేణుకాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె బోధనా విధానం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ విధానంలో బోధన విద్యార్థులకు చాలా సులువుగా అర్థం అవుతుందన్నారు. విద్యార్థులు పొరపాటున తప్పు చేసినా వాటిని గుర్తించి సరిచేసుకునే వెసులుబాటు సైతం ఉంటుందన్నారు. పరీక్షలు సమీపిస్తున్న సందర్భంగా పదవ తరగతి విద్యార్థులు టీవీ చూడటం, మొబైల్ వాడటం వంటివి మానేసి.. బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకట్, ఏఎస్‌వో రమేశ్, హెచ్‌ఎం షఫీ, సీఆర్పీ వెంకటేశ్, ఉపాధ్యాయులున్నారు.

సరికొత్త అలోచనలతో యువత ముందుకెళ్లాలి

తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్

సదస్సులో మాట్లాడుతున్న జయేశ్ రంజన్

నందిగామ, ఫిబ్రవరి 28 : సరికొత్త అలోచనలతో యువత ముందుకు వెళ్లి అద్భుతాలు సృష్టించాలని తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. నందిగామ మండలం కన్హా శాంతి వనంలో హార్ట్‌ఫుల్‌నెస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన స్టార్టప్ ఫోరమ్-2025 అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన పారిశ్రామికవేత్తలకు వ్యాపారరంగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో రెడ్ బస్ ఫౌండర్ ఫణీంద్ర సన, ఐలబ్స్ చైర్మన్ శ్రీనివాసరాజు, ఐఎన్‌కే ఫౌండర్ లక్ష్మి, క్యాన్సిల్డ్ ప్లాన్స్ వ్యవస్థాపకురాలు మల్లికారెడ్డి, దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 200 మంది పారిశ్రామికవేత్తలు, శ్రీరామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్‌ను అందించడానికి కృషి చేస్తాం

జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ లీలావతి



కెరెళ్లిలో పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ ఇంజినీర్ లీలావతి

ధారూరు, ఫిబ్రవరి 28 : విద్యుత్ వినియోగదారులు ఎటువంటి సమస్యలున్నా వెంటనే తమ దృష్టికి తీసుకువచ్చి మరింత మెరుగైన సేవలు అందించడానికి సహకరించాలని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ లీలావతి అన్నారు. శుక్రవారం ధారూరు మండల పరిధిలోని కెరెళ్లి గ్రామంలో పంటపొలాలను క్షేత్రస్థాయిలో విద్యుత్ శాఖ డీఈ, ఎడీఈ,ఎఈ లతో కలిసి పరిశీలించారు. కరెంటు సమస్యలపై దినపత్రికల్లో వచ్చిన అంశంలో నిజానిజాలు తెలుసుకోవడానికి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో విద్యుత్ వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు వ్యక్తం చేసిన రైతుతో పాటు అనేక మంది రైతులతో చర్చించారు.

అధిక సాంద్రత పత్తికి తేలికపాటి నేలలు అనుకూలం

తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుధారాణి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త సుధారాణి

పరిగి, ఫిబ్రవరి 28 : అధిక సాంద్రత పత్తి సాగుకు తేలికపాటి నేలలు అనుకూలమైనవని తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధన కేంద్రం, ఏరువాక కేంద్రం తాండూరు ఆధ్వర్యంలో సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాటన్ రీసెర్చ్‌వారి ప్రత్యేక ప్రాజెక్టులో భాగంగా అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై పరిగి మండలం సయ్యద్‌పల్లి రైతు వేదికలో శుక్రవారం జరిగిన అవగాహన సదస్సులో పాల్గొన్న సుధారాణి మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా పత్తి దిగుబడి నిలకడగా ఉన్నదని, దీన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అధిక సాంద్రతలో యాంత్రీకరణతో పత్తి విత్తుకోవచ్చని, తద్వారా విత్తనాలు సరైన లోతులో విత్తడం వల్ల మొలక మంచిగా వస్తుందన్నారు. అధిక సాంద్రత విధానంలో మంచి దిగుబడి వస్తుందని ఆమె తెలిపారు.

శాస్త్రవేత్త డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి అధిక సాంద్రత పత్తి విధానంలో ఆశించే తెగులు, వాటి నివారణ చర్యలను వివరించారు. పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి మాట్లాడుతూ.. అధిక సాంద్రత పత్తి సాగుకు అనువైన నేలలు, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున రైతులు ఈ పద్ధతి పాటించి అధిక దిగుబడి పొందాలన్నారు. ఈ విధానంలో పత్తి ఒకేసారి కోతకు వస్తుందని, అందువల్ల ఈ విధానాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త యమున, మండల వ్యవసాయాధికారి రజిత, ఉద్యానవన అధికారి వైజయంతి, రైతులు పాల్గొన్నారు.

మత్స్యకారులను విస్మరించిన మోదీ సర్కారు

సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 28 : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ మత్స్యకారులను పూర్తిగా విస్మరించిందని మత్స్యకారుల సంఘం జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ అన్నారు. తెలంగాణ మత్స్యకారుల సంఘం రంగారెడ్డిజిల్లా సమావేశం శనివారం ఇబ్రహీంపట్నంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చెనమోని శంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ మత్స్యకారులకు ఎలాంటి ఉపయోగం లేకుండా ఉందని విమర్శించారు. మత్స్యకారులతోపాటు పేదలకు కూడా ఉపయోగపడని బడ్జెట్ అని పేర్కొన్నారు. కేవలం కార్పొరేట్లను దృష్టిలో పెట్టుకుని కేటాయించిన బడ్జెట్ అని విమర్శించారు. మత్స్య సంపదపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులు ప్రకృతి వైపరీత్యాలు, కాలుష్యం వల్ల చనిపోతే ఎలాంటి నష్టపరిహారం ఇవ్వటంలేదని, దీంతో మత్స్యకారులు తీవ్రమైన నష్టాలు చవిచూస్తున్నారన్నారు. మత్స్యకారులను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ ఉన్నారు.

పశుగ్రాసం కొరత.. అన్నదాతకు వ్యథ

- ట్రాక్టర్ వరిగడ్డికి రూ.25 వేలకు పైగా పలుకుతున్న వైనం
- కొనలేక నానా తంటాలు పడుతున్న రైతులు

పశుగ్రాసం లేక లారీ ద్వారా తరలిస్తున్న గడ్డి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 28 : వేసవి కాలం రాకముందే పశుగ్రాసం కొరత తీవ్రమైంది. ఈసారి తీవ్ర వర్షాభావ పరిస్థితులలో శీతాకాలంలోనే గడ్డి ఎండిపోయింది. మూగ జీవాలకు గడ్డి దొరకడం గగనమైంది. పచ్చి గడ్డి లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయానికి అనుబంధంగా మేకలు, గొర్రెలు, పాడి గేదెలను పోషించుకుని జీవనం సాగిస్తున్నారు. పశుగ్రాసం కొరతతో వరిగడ్డికి డిమాండ్ పెరిగింది. ఒక్క ట్రాక్టర్ వరిగడ్డి కొనాలంటే రూ.25వేలకు పైగా.. లారీకైతే రూ.40వేల నుంచి రూ.50వేల దాకా ధర పలుకుతున్నది.

పాడిపరిశ్రమే ఆధారంగా..

పంటలకు సరిపడా నీళ్లు అందక రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రైతులు పాడిపశువులు, మేకలు, గొర్రెల పెంపకం చేపడుతున్నారు. 1.62 లక్షల గొర్రెలు, మేకలు., 12వేల ఆవులు, గేదెలున్నాయి. ఇన్ని మూగజీవాలున్నప్పటికీ పశుగ్రాసం కొరత ఉండటంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పాడిగేదెలకు పచ్చిగడ్డి లేక ఎండు గడ్డి వేయడంతో పాల ఉత్పత్తి కూడా తగ్గుతున్నదని రైతులు వాపోతున్నారు. వరిగడ్డి కూడా లభించకపోవడంతో రైతులు పశువులను అమ్ముకోవడానికి సిద్ధమవుతున్నారు.

వరిగడ్డికి పెరిగిన డిమాండ్..

పాడి పశువులకు రైతులు అధికంగా వరిగడ్డి, పచ్చిమేత ఉపయోగిస్తారు. ఈసారి వర్షాభావ పరిస్థితుల కారణంగా నీళ్లులేక రైతులు వరిసాగు చేయలేదు. కొద్దిపాటి నీళ్లు ఉన్న వారు మాత్రమే వరిసాగు చేయడంతో వరిగడ్డికి చాలా డిమాండ్ పెరిగింది. కొంతమంది స్థానికంగా వరిగడ్డి లభించకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తున్నారు. దీంతోపాటు పాడి రైతులు మొక్కజొన్న చొప్పును కూడా కొనుగోలు చేసి పశువులకు దాణాగా పెడుతున్నారు. శీతాకాలంలోనే పచ్చిగడ్డి లేకపోవడంతో మేకలు, గొర్రెలకు ఏ విధంగా వాటిని మేతను సమకూర్చాలో అర్థంకాక కొంతమంది పెంపకందారులు జీవాలను అమ్ముకుంటున్నారు.

నాగన్‌పల్లి సమీపంలో శిథిలావస్థకు చేరిన మూగజీవాల తాగునీటి తొట్టి

వృథాగా మారిన నీటితొట్లు

గ్రామీణ ప్రాంతాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు లక్షల రూపాయల వ్యయంతో తాగునీటి తొట్లను ఏర్పాటు చేశారు. కాని నేడు అవి వృథాగా మారాయి. తాగునీటి తొట్లలో గ్రామ పంచాయతీ నల్లాలు లేదా, ట్యాంకర్ల ద్వారా నీటిని నింపాలని రైతులు కోరుతున్నారు. ఒక పక్క మూగజీవాలు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అవి నేడు కూలిపోయే స్థితికి చేరుకున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో మూగజీవాల దాహార్తిని తీర్చాలని రైతులు కోరుతున్నారు.

గడ్డి కొనాలంటే చుక్కలు కనిపిస్తున్నాయి



పశువులకు గడ్డి కొనాలంటే చుక్కలు కనిపిస్తున్నాయి. నాకున్న ఆవులకు గడ్డికొనటానికి అడిగితే ఒక్క ట్రాక్టర్‌కు సుమారు 25 వేల వరకవుతుందని బేరగాడు చెప్పాడు. చేసేదేమీలేక ఆవులను అమ్మాల్సిన పరిస్థితి నెలకొంటున్నది. మూగజీవాలకు పశుగ్రాసం కొరత తీర్చేందుకు ప్రభుత్వం సబ్సిడీపై పశుగ్రాసం అందించాలి.

- హన్మంత్‌రెడ్డి, చర్లపటేల్‌గూడ

తీవ్రమైన పశుగ్రాసం కొరత



నాకున్న పొలంలో వరి పంట సాగుచేస్తే పంటపోను వచ్చిన గడ్డిని పశువులకు వేసేవాడిని, కాని, నీరు సరిగ్గా లేకపోవడంతోపాటు ఉన్న నీటితో పొలం సాగుచేసుకుందామంటే కాంగ్రెస్ సర్కారు వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడం లేదు. గడ్డిలేక ఉన్న గేదెలను సాకేందుకు ఇబ్బంది పడుతున్నా.

- సురేందర్, రైతు, రాయపోల్

హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదు

ఎస్సీ నారాయణరెడ్డి

వికారాబాద్/ధారూరు, ఫిబ్రవరి 28 : హత్య కేసులో నిందితులకు జీవితఖైదును ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి తీర్పు ఇచ్చినట్లు ఎస్సీ నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22.04.2018 న ఉదయం 9 గంటలకు పెండ్యాల యాదమ్మ (ఫిర్యాదురాలు) భర్త పెండ్యాల శ్రీనివాస్ (మృతుడు) తన సొంత గ్రామం ధారూరు మండలం మైలారంలో పొలం పనులు చూసుకొని వస్తానని తనకు తెలిసిన హరిదాస్‌పల్లి గ్రామానికి చెందిన వినోద్ కుమార్ అనే వ్యక్తిని వెంట తీసుకొని వెళ్లాడు. పొలం పనులు చూసుకొని తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో ఉదయం 11.30 గంటలకు మైలారం గ్రామానికి చెందిన ఏడుగురు పాత కక్షలు, రాజకీయ కక్షలను మనస్సులో పెట్టుకొని వేట కొడవలి, కర్రలతో వెంబడించి దాడి చేయగా పెండ్యాల శ్రీనివాస్ తలకు, మెడకు, చెవికి బలమైన గాయాలతో మృతిచెందాడు. శ్రీనివాస్‌ను కొడుతుండగా వినోద్ కుమార్ అక్కడి నుంచి పారిపోయి యాదమ్మకు సమాచారం అందించాడు. దీంతో యాదమ్మ ఫిర్యాదు చేయగా అప్పటి ధారూరు ఎస్‌హెచ్‌వో రాజు, ఏఎస్ఐ కేసు నమోదు చేశారు. అప్పటి ధారూరు సీఐ ఉపేందర్, అప్పటి వికారాబాద్ డీఎస్పీ శిరీష రాఘవేందర్ ఇన్వెస్టిగేషన్ చేసి కోర్టులో చార్జ్‌షీట్‌ను సమర్పించారు. వాదోపవాదనలు విన్న డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం నిందితులు ఏ1) మదులపల్లి దాసు, ఏ3) మదులపల్లి ప్రశాంత్ కుమార్ , ఏ4) మదుల పల్లి అరుణ్ కుమార్, ఏ6) మదులపల్లి భాస్కర్‌లకు జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా, జరిమానా కట్టకపోతే 4 నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా స్పెషల్ పీపీ సమరసింహారెడ్డి, ఇన్వెస్టిగేషన్ అధికారులు అప్పటి వికారాబాద్ శిరీష రాఘవేందర్, ధారూరు సీఐ ఉపేందర్, ఏఎస్ఐ రాజు, ఈ కేసు బ్రీఫింగ్ ఆఫీసర్లు అప్పటి ధారూరు ఇన్స్పెక్టర్ రామకృష్ణ, ప్రస్తుత ధారూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ రఘురాములు, ప్రస్తుత ధారూరు ఎస్‌హెచ్ఓ అనిత, సీడీవోలు షబ్బీర్ పాషా, శంకర్, లైజనింగ్ ఆఫీసర్ వీరన్న పనిచేయడం జరిగిందన్నారు. ఈ అధికారులను ఎస్సీ నారాయణరెడ్డి అభినందించారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

రంజాన్ మాసంలో ఇబ్బందులు లేకుండా చూడాలి

**అధికారులకు జిల్లా అదనపు కలెక్ట